## బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి రావాలి..

బొల్లారం,జూన్ 15: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మజీ మంత్రి కేటీఆర్ విచారణ నిమిత్తం సోమవారం ఏసీబీ వద్దకు వస్తుండడంతో.. ఆయనకు మద్దతుగా కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ అధికారుల ముందు హాజరై తన వాదనలను వినిపించడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను నెరవేర్చాలని, నిర్విరామంగా ప్రజల తరపున పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైన కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్య వహరిస్తూ, వారి కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మరో మారు ఈ ఫార్ములా అంశంలో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చిన కారణంగా సోమవారం విచారణకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు మద్దతుగా కంటోన్మెంట్ నుండి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఉదయం 9 గంటల వరకు తెలంగాణభవన్ కు చేరుకోవాలని వారు కోరారు.

## క్రీడా పాఠశాలలో అడ్మిషన్ల ఎంపికకు పోటీలు

**చర్లపల్లి, జూన్ 15 :** క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశానికి ఈనెల 18న కుషాయిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపికకు పోటీలను నిర్వహిస్తున్నామని కాప్రా మండలం ఎంఈఓ బాపురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుషాయిగూడ స్కూల్‌లో ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 17వ తేదీలోపు కార్యనిర్వాహక కార్యదర్శి ప్రభాకర్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకొవాలని, విద్యార్థులు కుల ధ్రువీకరణ, ఆధార్‌కార్డ్, ఐదు ఫోటోలు, 3వ తరగతి ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆయన కోరారు.

# అందరికీ సమాన విద్య, వైద్యం అందించాలి..

### నేషనల్ కమిషన్ ఆఫ్ షెడ్యూల్ ట్రైబ్స్ మెంబర్ హుస్సేన్ నాయక్



సభలో మాట్లాడుతున్న నేషనల్ కమిషన్ ఆఫ్ షెడ్యూల్ ట్రైబ్స్ మెంబర్ హుస్సేన్ నాయక్

అడ్డగుట్ట, జూన్ 15 : ఒకప్పుడు అన్ని రంగాల్లో వెనుకంజలో ఉన్న యూపీ, బీహార్ రాష్ట్రాలు ఇప్పుడు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయని, సంపన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణ మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోతుండడం ఆందోళనకరమైన పరిణామమని నేషనల్ కమిషన్ ఆఫ్ షెడ్యూల్ ట్రైబ్స్ మెంబర్ జాతు హుస్సేన్ నాయక్ అన్నారు. తెలంగాణ స్టేట్ యానాదిస్ (గిరిజన) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్టుగూడ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో యానాదుల ఆత్మగౌరవ సభ, జనరల్ బాడీ మీటింగ్ , ఫ్యామిలీ గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్, ఐఏఎస్ అధికారి శ్రీధర్, అసోసియేషన్ చైర్మన్ ఆంజనేయులు, జాతీయ గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీవీ రమణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ... సొంత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. ప్రపంచమంతా ఎటువైపు వెళుతుందో మనం కూడా అటువైపే చూడాలని, ఇంగ్లీష్ విద్యలో రాణిస్తే ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చునని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని వ్యాపారంగంలో రాణిస్తూ మరో 10 మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించేస్థాయికి ఎదగాలని ఆయన యువతకు సూచించారు. ఉచిత పథకాలకు స్వస్తి పలికి అందరికీ సమానంగా విద్య, వైద్యం అందేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ స్టేట్ యానాదిస్ (గిరిజన) వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఆంజనేయులు, అధ్యక్షుడిగా రామచంద్రరావు, జనరల్ సెక్రెటరీగా సాంబశివరావు, ట్రెజరర్‌గా జేసీ శేషాద్రిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏడుకొండలు, పార్థసారథి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ రావు, శివశంకర్ రావు, రామకృష్ణయ్య, సురేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత కుటుంబ సభ్యులకు పరామర్శ..



బేగంపేట్ జూన్ 15: రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడిని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. కళాసిగూడకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు ఆంజనేయులు మాతృమూర్తి సత్యమ్మ ఇటీవల మరణించగా, ఆదివారం వారి ఇంటి వద్ద నిర్వహించిన దశదిన కర్మకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యమ్మ చిత్రపటం వద్ద పూలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయులు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి.. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యేవెంట మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, విజయ్, చందుచారి, దేవేందర్ చారి, నరేశ్, ఆరీఫ్, తదితరులు ఉన్నారు.

### నివాళి..



రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఘన్ శ్యామ్ ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ .. ఆదివారం నెక్లెస్ రోడ్‌లో గల అంబేద్కర్‌నగర్‌లోని నివాసానికి వెళ్లి ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, రాంగోపాల్ పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు గణేశ్, తదితరులు ఉన్నారు. *– బేగంపేట్, జూన్ 15*

## పార్టీ పటిష్టతే లక్ష్యంగా ముందుకు సాగాలి..


సమావేశంలో మాట్లాడుతున్న రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్

చిక్కడపల్లి, జూన్ 15: పార్టీ పటిష్టతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ అన్నారు. పార్టీ కోసం ప్రతి నాయకుడు పనిచేయాలని కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే ముఠాగోపాల్ , యువ నాయకుడు ముఠా జయసింహల ఆదేశాల మేరకు ఆదివారం రాంనగర్‌లోని భారత రాష్ట్ర సమితి రాంనగర్ డివిజన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలన్నారు. పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, ముదిగొండ మురళి, గోక నవీన్, వివేక్, నీలాదేవి, తులసీ, విజయ్ కృష్ణ, జ్ఞానేశ్వర్ గౌడ్, శ్రీకాంత్, సందీప్ పాల్గొన్నారు.

## సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలి..



బద్దం మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డైరెక్టర్ బీరప్ప

చిక్కడపల్లి, జూన్ 15: సామాజిక సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిమ్స్ హాస్పిటల్ (నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) డైరెక్టర్ బీరప్ప అన్నారు. మైనంపల్లి ట్రస్ట్ చైర్మన్ బద్దం మోహన్‌రెడ్డి రక్తదాన శిబిరాలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఆదివారం నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ,నిమ్స్ సూపరింటెండెంట్ సత్యనారాయణలు బద్దం మోహన్‌రెడ్డిని సన్మానించి.. జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నిమ్స్ డాక్టర్లు, నిమ్స్ సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు



తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ , బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ ల ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్, వెంకటేశ్‌గౌడ్, బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నాగేశ్వర్ గౌడ్, తదితరులు కూడా పలువుని పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. *– చిక్కడపల్లి, జూన్ 15*






## అనాథలకు దుస్తుల అందజేత



నగరంలో రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, అభాగ్యులు, నిరుపేదలకు ఆదివారం స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ సంజీవకుమార్, ఉపాధ్యక్షురాలు పావనీ, సభ్యులు పాల్గొన్నారు. *– బన్సీలాల్ పేట్, జూన్ 15*

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


రోగులకు మందులు అందిస్తున్న సీఐ అప్పల నాయుడు, ట్రస్ట్ ప్రతినిధి వీకే శబరి

ఉస్మానియా యూనివర్సిటీ: బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సీఐ అప్పల నాయుడు అన్నారు. స్వాంతన చారిటబుల్ ట్రస్ట్, గద్దె రామోజీ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మాణికేశ్వరీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ నుంచి వచ్చిన జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ వైద్యులు 200 మందికి ఉచితంగా బీపీ, షుగర్, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి ఆరోగ్య సలహాలను, మందులు అందజేశారు. ఈ శిబిరంలో ఎస్ఐ శ్రీహరి, టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయకుమార్, స్వాంతన చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు వీకే శబరి, నర్సింగ్ రావు, శిరీష, లావణ్య, ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్, కిమ్స్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ విక్రమ్ పాల్గొన్నారు.

# ఘనంగా ఉర్సు ఉత్సవాలు



**శామీర్‌పేట, జూన్ 15 :**మండల కేంద్రంలోని హజరత్ సయ్యద్ జలాల్ ఉద్దీన్ ముల్తాని రెహ దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదిఆవరం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దర్గాను దర్శించుకొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయనకు ముస్లిం మత పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, డైరెక్టర్ భూమి రెడ్డి, అలియాబాద్ మాజీ సర్పంచ్ కుమార్ యాదవ్, నాయకులు ముజిబుద్ధిన్, బీఆర్ఎస్ నాయకులు హరి మోహన్ రెడ్డి, చాంద్ పాషా, వంగ వెంకట్ రెడ్డి , మాజీ వార్డు సభ్యులుపాల్గొన్నారు.

## వైద్యుల సేవలు వెలకట్టలేనివి ..



చిక్కడపల్లి, జూన్ 15: తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారని తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ తనుగుల జితేందర్ రావు అన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న డాక్టర్ ఎ.చైతన్య రెడ్డిని కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా జితేందర్ రావు మాట్లాడుతూ .. తాను కూడా చైతన్య రెడ్డి వద్ద వైద్యం చేయించుకున్నానని అని అన్నారు. ఆయన రోగుల పట్ల అంకితభావం, వైద్యం పట్ల అవిశ్రాంత నిబద్ధత కనిపిస్తుందన్నారు. డాక్టర్ చైతన్య రెడ్డి తన జీవితంలోనే కాకుండా లెక్కలేనన్ని మంది జీవితాల్లో కూడా తీవ్ర మార్పును తెచ్చారు. ఆయన నిజంగా మనసమాజానికి ఒకవరంఅని అన్నారు.

## బీటెక్ విద్యార్థి అదృశ్యం


రాహుల్ (ఫైల్ )

**ఘట్ కేసర్, జూన్ 15:** బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం కథనం ప్రకారం...ఘట్‌కేసర్‌లోని వివేకానంద జూనియర్ కళాశాల సమీపంలో నివాసముంటున్న ఇస్లావత్ రాహుల్(21) మున్సిపాలిటీ పరిధి అం కుషాపూర్‌లోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల14న తన రూమ్ నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని తండ్రి మల్లేష్ అతని కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థి సమాచారం తెలిసినవారు సాయికుమార్ ఎస్సై 87125 80183, ఘట్ కేసర్ పోలీస్ స్టేషన్ 87126 62705కు సమాచారం ఇవ్వాలని కోరారు.


# కార్మికులకు జరిగిన మోసంపై విచారణ జరిపించాలి

### సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్


ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

కవాడిగూడ, జూన్ 15: తెలుగు సినిమా కాస్ట్యూమ్ యూనియన్‌లో హౌజింగ్ పేరుతో కార్మికులను మోసం చేసిన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులను శిక్షించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్ డిమాండ్ చేశారు. తెలుగు సినిమాలో కాస్ట్యూమ్ కార్మికులకు ఇంటి స్థలాలు ఇప్పిస్తామని వసూలు చేసిన డబ్బులు ఖర్చుచేసి భూమి కొనకుండా కార్మికులను మోసం చేసిన యూనియన్ నాయకులపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సినిమా కాస్ట్యూమ్ కార్మికులు ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తెలుగు సినిమా కాస్ట్యూమ్ కార్మికులను మోసం చేసిన యూనియన్ అధ్యక్షుడు వాసు, కార్యదర్శి నరసింహారావు, కోశాధికారి రాంబాబులపై తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 20 ఎకరాల భూమి కొనుగోలు చేస్తున్నామని కార్మికులకు మాయమాటలు చెప్పిన యూనియన్ నాయకులు.. చివరకు 16 ఎకరాలే కొన్నామని, అందులో 13 ఎకరాలే మిగిలిందని , మిగతాది కబ్జాకు గురైందని అంటున్నారని తెలిపారు. 13 ఎకరాల్లో ఏడెకరాలే అగ్రిమెంట్ చేసుకుని అందులో ఐదు ఎకరాలే ఉన్నట్లు అధ్యక్ష, కార్యదర్శితో పాటు కోశాధికారులు మోసపూరిత మాటలు చెబుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని బాధితులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే పోలీసులతో విచారణ జరిపిస్తామని ప్రజావాణిలో అధికారులు హామీ ఇచ్చినప్పటికీ ఎలాంటి విచారణ జరపకుండా కేసు విచారణ మూసేయడం అన్యాయమన్నారు. తెలుగు సినిమా పెద్దలకు కూడా ఈ విషయం తెలిసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో జూనియర్ ఆర్టిస్ట్‌ల యూనియన్‌లో జరిగిన మోసాలపై కార్మికుల పక్షాన సీఐటీయూ పోరాటం చేసిందన్నారు. చిత్రపురి కాలనీలో జరుగుతున్న మోసాలపైనా పోరాటం చేస్తున్నామన్నారు. తెలుగు సినిమా కాస్ట్యూమ్ కార్మికులకు జరిగిన మోసంపై విచారణ జరిపించాలని లేనట్లయితే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు కామేశ్‌బాబు, కాస్ట్యూమ్ యూనియన్ వర్కర్స్ నాయకులు ఎస్.కె.బాబ్జి, రమేశ్, సాంబశివరావు, రాజు, జూనియర్ ఆర్టిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి రమావేణి, తదితర కార్మికులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌కు అభినందనలు ..



చిక్కడపల్లి, జూన్ 15: వడ్డెర సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకుడు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జరిపిటి జైపాల్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవి వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం తెలంగాణ లక్ష్యసాధన కమిటీ అధ్యక్షుడు ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ రాజు, వడ్డెర సంఘం తెలంగాణ గన్ను దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, వడ్డెర సంఘం ముఖ్య సలహాదారుడు ట్రస్ట్ ఓర్సు కృష్ణయ్య, పల్లపు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## కూచిపూడి నృత్య ప్రదర్శన

**ఉప్పల్,జూన్15:** ఉప్పల్ శిల్పారామంలో వారాంతపు సాం స్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కెనడా కూచిపూడి కళాకారిణి రేణి శ్రీజిత్ తన ప్రదర్శనలో పుష్పాంజలి, శివ స్తుతి, పదం, అన్నమాచార్య కీర్తన, నిరుపమా సుందరాకార అంశాలను ప్రదర్శించి మెప్పించారు. నృత్య కిన్నెర వ్యవస్థాపకులు, సంగీతనాటక అకాడమీ అవార్డీ మద్దాలి ఉష గాయత్రీ శిష్య బృందం నీరజ , లక్ష్మి శ్రీ, వైష్ణవి, వినీత, ఉజ్వల, సిరి చందాన, దీపిక లు తమ ప్రదర్శన చేపట్టారు. శరణం భావ, బలకనక మయ, శ్రీనగరళహరి, నారాయణతే, బ్రోచేవారు, ఒకపరికొకపరి, చందాన చర్చిత, తిల్లాన, తరంగం అంశాలను ప్రదర్శించారు.

## మహాకవి శ్రీశ్రీ జీవితాన్ని తెలుసుకోవాలి

### ఏఐడీవైఓ రాష్ట్ర కన్వీనర్ తేజ



శ్రీశ్రీ విగ్రహం వద్ద నినదిస్తున్న ఏఐడీవైఓ నాయకులు

కవాడిగూడ, జూన్ 15: మహాకవి శ్రీశ్రీ జీవితాన్ని, సాహిత్యాన్ని, భావాలను నేటి యువత తెలుసుకోవాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్(ఏఐడీవైఓ) రాష్ట్ర కన్వీనర్ తేజ అన్నారు. శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకొని ఆల్‌ఇండియా డెమోక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై నున్న శ్రీశ్రీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ.. శ్రీశ్రీ రచనలు, ఆలోచనలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఆయన రచనలు ఎంతో మంది యువకుల్లో సామాజిక బాధ్యతను రగిలించాయన్నారు. తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించిన శ్రీశ్రీ ప్రజల హృదయాల్లో మహాకవిగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ నాగరాజు, సభ్యులు గంగాజి శ్రీనివాస్, జానీ, దేవరాజ్, నవనీత్, యువకులు పాల్గొన్నారు.

## కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**చర్లపల్లి, జూన్ 15:** నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని శివసాయినగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో చేపట్టిన భూగర్భడ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా వాసవిశివనగర్‌లో సుమారు రూ.6 కోట్ల నిధులతో చేపట్టిన బాక్స్‌డ్రైయిన్ పనులు పుర్తయిన వెంటనే రోడ్ల నిర్మాణ పనులు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. డివిజన్‌లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్‌గౌడ్, సీసీఎస్ అధ్యక్షుడు పద్మారెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.

### సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి

**ఉప్పల్:** సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ సమావేశం నాచారంలోని హెచ్ ఎంటీనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి, ఎమ్మెల్సీ కోదండ రామ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్ లకు సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నరహింహ, మాజీ మేయర్ వెంకట్ రెడ్డి, ఎల్లారెడ్డి, నాయకులు సాయిజెన్‌శేఖర్, సాయిబాబా, ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.